క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో గౌరీగిరి కొండపై వెలసిన కోదండ సీతా రామచంద్రమూర్తి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి కోదండ సీతారామచంద్రమూర్తిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ దాడి శ్రీను, మౌనిక, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం

మునగపాక: మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడి అభివృద్ధికి పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. గురువారం మునగపాకకు చెందిన బొడ్డేడ చిన అప్పలనాయుడు, నాగయమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు రామకృష్ణ అప్పారావు రూ.5,116 నగదును సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, కమిటీ సభ్యులకు అందజేశారు.

మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం



మెయిన్‌రోడ్డులో నిలిచిన వాహనాలు

మునగపాక: పూడిమడక రోడ్డులో నిత్యం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మునగపాక వద్ద బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జిపై ఇరువైపులా వాహనాలు వచ్చే క్రమంలో తప్పించుకునేందుకు అవకాశం లేకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గురువారం ఇదే తరహాలో బ్రిడ్జిపైకి వాహనాలు ఎదురెదురుగా వచ్చేయడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్థానికులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.


రీసర్వేలో లోపాలపై దృష్టి సారించాలి

మునగపాక: రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రీ-సర్వేలో జరిగిన లోపాలను సరిచేసేందుకు పాటు పడాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ భూములను పరిరక్షించాలన్నారు. రీ-సర్వే డీటీ పడాల్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

రాంబిల్లి(యలమంచిలి): తాగునీటి బోరును తొలగించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని గోకివాడ సర్పంచ్ నీరుకొండ శారదా కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాంబిల్లి మండలం గోకివాడ పంచాయతీ మూలకొత్తూరు గ్రామంలో సర్వే నంబర్ 341లో కొండమీద ఉన్న ఇళ్లకు వెళ్లే రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో మంచినీటి బోరు గతంలో ఏర్పాటు చేశామన్నారు. మరమ్మతులకు గురైన బోరును వినియోగంలోకి తీసుకురావడానికి ఇటీవల పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. అయితే ప్రస్తుతం బోరు చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పక్కుర్తి నర్సింగరావు అనే వ్యక్తి ఆక్రమించి పశువుల పాక ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల 19న పక్కుర్తి రామకృష్ణ అనే వ్యక్తి పొక్లెయిన్‌తో తాగునీటి బోరును ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించి, స్థలాన్ని చదును చేసేశాడని ఆమె ఆరోపించారు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాంబిల్లి తహసీల్దారుతో పాటు రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

పరిమితికి మించి తీసుకెళ్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను తీసుకువెళితే చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. మునగపాకలో గురువారం సాయంత్రం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆటో డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటోలో అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో సాయిబాబా ఆలయ ప్రాంగణంలో వినాయక, దత్తాత్రేయ ఆలయాల నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. మందపాటి సత్యనారాయణరాజు, రమాదేవి దంపతులు శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 4 లక్షల వ్యయంతో ఈ ఆలయాల నిర్మాణం చేపడతున్నట్టు ఆలయ అర్చకుడు సాయి తెలిపారు.

లక్ష్య పది తలు



ఉద్దండపురం పాఠశాలలో రాత్రి పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- కార్పొరేట్‌కు దీటైన ఫలితాల కోసం కృషి
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- ఇళ్ల బాట పడుతున్న ఉపాధ్యాయులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు

నక్కపల్లి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చి దిద్దింది. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చింది. మౌలిక వసతులు కల్పించింది. నేలపై కూర్చొనే విద్యార్థులకు బెంచీలు ఏర్పాటు చేసింది. విద్యా వ్యవస్థలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడం, విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరుతో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల దుస్తులు, బ్యాగులు, షూస్, సాక్సులు, వంటివి సమకూర్చడంతో పాటు, అమ్మఒడి పథకాన్ని అమలు చేసి.. ఏ లోటూ లేకుండా చేసింది. ఇప్పుడా సౌకర్యాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాల కోసం పాటు పడతున్నారు.

మండలంలో సుమారు 650 మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. పరీక్షలకు కేవలం 25 రోజులు మాత్రమే సమయం ఉండడంతో ఉపాధ్యాయులు సైతం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉద్దండపురం, దేవవరం, నక్కపల్లి, జానకయ్యపేట, డీఎల్‌పురం, వేంపాడు తదితర పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దాతల సాయంతో స్టడీ అవర్స్‌కు వచ్చే విద్యార్థులకు అల్పాహారం కూడా సమకూరుస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సాయంత్రం పూట, రాత్రి పూట విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. స్టడీ అవర్స్ నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థులు కూడా ఒత్తిడికి గురికాకుండా పదో తరగతి పరీక్షల్లో పదికి పది మార్కులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఉపాధ్యాయులు స్టడీ అవర్స్ నిర్వహించడంతో పాటు, రాత్రిపూట విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉపయోగకరంగా స్టడీ అవర్స్



ఇంటి వద్ద ఒక్కరే చదవాలంటే కొంత సేపే దృష్టిపెట్టగలం. సందేహాలు తీర్చేవారుండరు. అందుకనే పాఠశాలలో ఉపాధ్యాయులు పర్యవేక్షణలో ప్రతిరోజు రాత్రి స్టడీ అవర్స్‌లో చదువుకోవడం ఉపయోగకరంగా ఉంది. అల్పాహారం కూడా అందిస్తున్నారు. మంచి మార్కులతో పాస్ అవుతాననే ధైర్యం ఉంది.

– పాలూరి శిరీష, విద్యార్థి, ఉద్దండపురం

ఎప్పటికప్పుడు సందేహాల నివృత్తి



మా స్కూల్లో టీచర్‌లు అన్ని సబ్జెక్టులు బాగా బోధిస్తున్నారు. స్టడీ అవర్స్‌లో సందేహాలు నివృత్తి చేస్తున్నారు. దేనిలో వెనుకబడి ఉన్నామో తెలుసుకుని దానిలో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. స్టడీ అవర్స్ చాలా ఉపయోగపడుతున్నాయి. కచ్చితంగా మంచి మార్కులు సాధిస్తాను.

– బొండాడ జ్యోతి, విద్యార్థి, ఉద్దండపురం

ఉత్తమ ఫలితాలకు కృషి



పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అన్నభేదం లేకుండా అందరం కలిసికట్టుగా రాత్రి పూట స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి మోటివేట్ చేస్తున్నాం. డిసెంబరు నుంచే రాత్రి పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మండలంలో ఫస్ట్ రావాలన్నదే మా తపన.

– సత్యారావు, హెచ్‌ఎం, ఉద్దండపురం హైస్కూల్

టీచర్ల సూచనలు పాటిస్తున్నాం..



ప్రతిరోజు రాత్రి టీచర్లు మా పాపకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తున్నాం. ఇంటి వద్ద ఉన్న సమయంలో టీచర్లు చెప్పినట్లు టీవీలు, ఫోన్‌లు చూడనివ్వడం లేదు. మంచి మార్కులు సాధిస్తారనే నమ్మకం ఉంది.

– బొండాడ అనంత లక్ష్మి, విద్యార్థిని తల్లి

నక్కపల్లిలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటుకు వినతి



ఆధార్ శాశ్వత కేంద్రం కోసం కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వీసం రామకృష్ణ

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ రత్నకుమారి, తదితరులు కలెక్టర్ విజయకృష్ణన్‌ను కోరారు. గురువారం నక్కపల్లి వచ్చిన కలెక్టర్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాలున్నాయన్నారు. గతంలో ఇక్కడ ఉండే ఆధార్ కేంద్రం ద్వారా మళ్లీ కార్యకలాపాలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2024 ప్రారంభం నుంచి సాంకేతిక కారణాల వల్ల పంచాయతీ కార్యాలయంలో ఉండే ఆధార్ కేంద్రంలో సేవలు నిలిచిపోయాయన్నారు. కొత్తగా ఆధార్ కార్డు పొందాలనుకునే వారు, తప్పు ఒప్పులను సరిచేయాలనుకునే వారు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. మండలంలో 32 పంచాయతీలు ఉన్నాయని, నక్కపల్లిలో గతంలో ఉన్న ఆధార్ సేవల కేంద్రాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి కేంద్రం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం

- కొత్తపేట శివాలయంలో ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట పురాతన శివాలయం పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో శుక్రవారం దేవతామూర్తుల శిలా విగ్రహాల పునః ప్రతిష్ట కార్యక్రమం చేపట్టడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. శివపార్వతులు, ఇతర దేవతామూర్తుల విగ్రహాల పునః ప్రతిష్ట క్రతువు ఈ నెల 17వ తేదీ నుంచి కొనసాగుతోంది. చివరి రోజు పునః ప్రతిష్ట, అష్ట బంధన మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తాండవకాశీ తపోవనం మఠాధిపతి పరమహంస సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి హాజరు కానున్నారు. పునః ప్రతిష్టలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట స్వామి చేతుల మీదుగా జరిపించడానికి ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు నిర్ణయించారు. ఇది పూర్తి కాగానే శుక్రవారం సాయంత్రం శివపార్వతుల శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.



శివాలయంలో శిలా విగ్రహాలకు ధాన్యాధివాసం చేస్తున్న వేద పండితులు

మరో వైపు గురువారం విగ్రహ పునః ప్రతిష్ట క్రతువులో భాగంగా నాలుగో రోజు ధాన్యాధివాసం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ప్రాతరౌపాసన, నిత్యపూజ, వేద పారాయణలు, రుద్రహోమం నిర్వహించగా.. సాయంత్రం రుద్ర హోమం, మూలమంత్ర హోమం, వేద పారాయణ, పంచ శయ్యాధివాసం, నీరాజనం, మంత్రపుష్పం చేశారు. ఈ కార్యక్రమంలో పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, బండారు సత్య బంగారుశెట్టి, సుందరపు బాబ్జీ, దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు.



పునఃప్రతిష్ట చేయనున్న విగ్రహాలు ఉంచిన చోట నీటిపై దేవతామూర్తుల ఆకారాలు సాక్షాత్కారం

అద్భుతం ఆవిష్కరణ

ఇక్కడ పునర్నిర్మించిన శివాలయంలో జలాధివాసం నిర్వహించిన తర్వాత విగ్రహాలు ఉంచిన చోట నీటిపై దేవతామూర్తుల ఆకారాలు కనిపించడం పరమశివుని ఆశీర్వాదం, కటాక్షంగా భక్తులు భావిస్తున్నారు. ఈ అద్భుత దృశ్యం చూసేందుకు భారీగా ఆలయానికి చేరుకున్నారు. ఓం నమః శివాయః మంత్రోచ్చారణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఇది చూసే భాగ్యం దక్కడం అదృష్టంగా అంతా భావించారు.

హెల్మెట్ ధారణ ఆ కుటుంబానికి రక్ష

- పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్
- పట్టణంలో పోలీసుల అవగాహన ర్యాలీ

యలమంచిలి రూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వారి జీవితానికే కాదు ఆ కుటుంబానికి కూడా రక్షణ అని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ అన్నారు. జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం యలమంచిలి పట్టణంలో సర్కిల్ పోలీసులు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడిపి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు, రవాణా అధికారులు జరిమానాలు విధిస్తారనే భయంతో కాకుండా స్వీయ రక్షణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ సూచించారు. రోడ్డు ప్రయాణం సాఫీగా సాగాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యలమంచిలి సీఐ ధనుంజయరావు కోరారు. ఇటీవల హెల్మెట్ ధరించిన వారు ప్రమాదాలకు గురైనపుడు ప్రాణాలతో బయటపడ్డారని, హెల్మెట్ ధరించని వారు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ట్రాఫిక్, రూరల్, పట్టణ ఎస్సైలు బి.రామకృష్ణ, ఎం.ఉపేంద్ర, కె.సావిత్రి, ఏఎస్సై చెల్లారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ ధారణపై ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ధనుంజయరావు, ఎస్సైలు

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'కు మద్దతుగా ప్రచారం

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడిని గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య కోరారు. మండలంలో పలు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలకు నిత్యం పరిష్కరించేందుకు కృషి చేస్తున్న నాయకుడు శ్రీనివాసులునాయుడని చెప్పారు. ఆయనకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సీనియర్ నాయకుడు ఆదినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగు, అధ్యక్షుడు భద్రరావు, సమన్వయకర్త సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం అగ్రహారం పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఉపమాక గ్రంథాలయం తనిఖీ

నక్కపల్లి: ఉపమాకలో ఉన్న గ్రామీణ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సిహెచ్.వెంకటరావు గురువారం తనిఖీ చేశారు. 2023-24 వార్షిక సంవత్సరానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, పాఠకుల నుంచి డిపాజిట్లు సేకరించాలని లైబ్రేరియన్ జనార్దన్‌కు సూచించారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. పంచాయతీల నుంచి రావాల్సిన గ్రంథాలయ సెస్సు వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో రికార్డుల నిర్వహణ తీరు, విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలు, కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రంథ పాలకుడు జనార్దన్‌ను అభినందించారు. గ్రంథాలయం ప్రహరీకి పెయింటింగ్ వేయించాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి వెంకటరావు

విద్యార్థులకు మండల స్థాయి పోటీలు

నక్కపల్లి: వచ్చే నెల 3న రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెటిరో రసాయన పరిశ్రమ యాజమాన్యం అధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. వ్యాసరచనలో గృహోపకరణాలు వినియోగంలో భద్రత ప్రమాణాలు అనే అంశం పైన, చిత్ర లేఖనంలో రహదారి భద్రత అనే అంశం పైన ఈ పోటీలు ఏర్పాటు చేశారు. విభాగాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని సంస్థ డీజీఎంలు కుళ్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డిలు తెలిపారు. ఈ పోటీలను ఎంఈవో కుంచం నరేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, హెటిరో ప్రతినిధి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రోడ్డు పనుల పరిశీలన

కోటవురట్ల: కె.వెంకటాపురం-బోడపాలెం రహదారి నిర్మాణ పనులను జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వీరన్ననాయుడు గురువారం పరిశీలించారు. నాణ్యత పరిశీలించి కాంట్రాక్టరు సూచనలు చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ కె.వెంకటాపురం నుంచి బోడపాలెం గ్రామానికి రూ.2 కోట్లు వెచ్చించి 3.4 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పలు గ్రామాలకు వెళ్లేందుకు దూరం తగ్గుతుందన్నారు. రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కుమారరాజా, ఏఈ వర్మ పాల్గొన్నారు.



కె.వెంకటాపురం-బోడపాలెం రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి వీరన్ననాయుడు

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

అచ్యుతాపురం రూరల్ : ఎండకు ఎండి వానకు తడుస్తూ ప్రాణాలు పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు అధ్యక్షతన పంచాయితీ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, ఈఎస్‌ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ అయిన వారికి గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికులకు చేతి గ్లౌజులు, బూట్లు, ఫేస్ మాస్కులు, నూనె, సబ్బులు, నాణ్యమైన పరికరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు కె.రామ సదాశివరావు, తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాము

పిల్లల్లో అభ్యసన నైపుణ్యాలు పెంచాలి



అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన చిత్రాలు

మునగపాక: పిల్లల్లో అభ్యసన నైపుణ్యాలు పెంచాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శివనాయుడు, డీఆర్పీ బుద్ద నరసింగరావు, జీవీ జగదీష్, వి.శ్రీనివాసరావు, అన్నపూర్ణ, మీరాభి, సీఆర్‌ఎంటీఎస్‌లు లక్ష్మీనారాయణ, సత్తిబాబు, అచ్యుతకృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన పలు రకాల చిత్రాలను ప్రదర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ధర్మవరం ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం ధర్మవరం గ్రామానికి మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు, పెనుగొల్లులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, వమ్మవరంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

గిరిజనుల ఇళ్ల పరిశీలన


కోటవురట్ల: ప్రభుత్వం ఇచ్చిన జీవో నం.30 ప్రకారం 2019కు ముందు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారిని గుర్తించి క్రమబద్ధీకరిస్తున్నట్టు తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. కైలాసపట్నంలో శివారు రాజగోపాలపురం ఎస్టీ కాలనీలో తహసీల్దారు గురువారం పర్యటించారు. కొండ పోరంబోకు భూమిని ఆక్రమించుకుని పాకలు, ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారి గురించి విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అటువంటి వారిని గుర్తించి కనీస రుసుంతో క్రమబద్ధీకరించేందుకు సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఊర్ధ్వరావు, వీఆర్వో రామకృష్ణ, సర్వేయర్ జహీరాభాను, గిరిజనులు పాల్గొన్నారు.



రాజగోపాలపురంలో గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దారు తిరుమలబాబు

ముగిసిన తొలివిడత శిక్షణ

కోటవురట్ల: జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మూడో రోజు గురువారం కూడా కొనసాగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గుణాత్మకమైన విద్యపై శిక్షణ ఇస్తున్నారు. గురువారం ధ్యానంపై అవగాహన కల్పించి పిల్లలకు సాంస్కృతిక కలలు నేర్పడంపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం తొలివిడత పూర్తికాగా.. రెండో విడత ఈ నెల 22 నుంచి 25 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ విలియమ్స్, అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటవురట్లలో జ్ఞానజ్యోతి శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉపాధి కల్పించకపోతే భూములు తిరిగిచ్చేయండి



రైతులతో భూములు పరిశీలిస్తున్న ఏపీఐఐసీ ఆర్ఐ మురళీకృష్ణ

అచ్యుతాపురం రూరల్ : స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేదంటే తమ భూములను తిరిగి ఇచ్చేయాలని దుప్పితూరు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం విశాఖపట్నం ఏపీఐఐసీ ఆర్ఐ మురళీకృష్ణ, ఆర్ఐ రవి దుప్పితూరు గ్రామ రైతుల భూములు, దేవస్థానం భూములను పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రత్యేక ఆర్థిక మండలి ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పి యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి నేటికీ చాలా భూములు నిరుపయోగంగా ఉంచారన్నారు. ఆ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పకపోతే తమ భూములు వెనక్కి అప్పగించాలన్నారు. శ్రీభద్రావతి సమేత భావనా రుషి ఆలయ భూమికి నేటికీ నష్టపరిహారం చెల్లించలేదన్నారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆర్ఐ హామీ ఇచ్చారు.